క్లుప్తంగా

విజ్ఞాన్ విద్యార్థినికి రూ.40 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థిని బయ్యన రేణు అక్షయకు అమెజాన్ కంపెనీలో రూ.40 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఫణీంద్రకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని బయ్యన రేణు అక్షయ, ఆమె తల్లిదండ్రులు రాజీవ్– పద్మలను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య సన్మానించారు.

బాలల హక్కులపై కళాజాతా



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పెదనందిపాడు ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాలల హక్కులపై కళాజాతా బృందం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం, బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాల నిషేధం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్..వంటి వివిధ అంశాలపై పాటలు, నాటికలు, పద్యాల రూపంలో కళాకారుల బృందం సభ్యులు ఎం.దుర్గాప్రసాద్, ఎం, గోపినాథ్ వివరించారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగం



పొన్నూరు: మండలం చింతలపూడిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సంక్రాంతి పురస్కరించుకుని శనివారం పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అనేక రకాల పుష్పాలతో భక్తిశ్రద్ధలతో యాగం చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్ష



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాలలో శనివారం ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ గుంటూరు గ్రూప్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లకు ఏ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షకు గుంటూరు గ్రూప్ పరిధిలోని 30 పాఠశాలలకు చెందిన 800 మంది క్యాడెట్లు హాజరైనట్లు చెప్పారు. రాత పరీక్ష అనంతరం డ్రిల్‌కు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. ఆర్మీలో సిబ్బంది కొరతను తీర్చేందుకు 1948లో ఎన్‌సీసీని ఏర్పాటు చేశారని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి కళాశాలల్లో చదివే వివిధ రకాల విద్యార్థినీ, విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ అందిస్తున్నామని, ఒక వ్యక్తిని క్రమశిక్షణలో నడిపేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ విజయ్ మోహితి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో సీఎంకు స్థానం దక్కలేదు..



నెహ్రూనగర్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలు గుంటూరు నగరంలో నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పీఎం ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఇతర ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఫొటోలు ఫ్లెక్సీలో స్థానం దక్కించుకున్నారు. అయితే సీఎం చంద్రబాబు నాయుడు ఫొటోకి మాత్రం చోటు కల్పించకపోవడంతో సదరు కార్యక్రమం వద్ద తెలుగు తమ్ముళ్లు హడావుడి చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు.

• నిర్లక్ష్యం





వంతెనపై పెరిగిన చెట్లు

నిడుబ్రోలు వంతెన గోడలపై పెరుగుతున్న రావి చెట్లతో ప్రమాద భరితంగా మారింది. పిల్లర్లు, గోడల్లో పెరుగుతున్న మొక్కలు వంతెన ను ధ్వంసం చేస్తున్నాయి. వంతెనపై అనేక చోట్ల పిల్లర్లు, జాయింట్ల మధ్యలో మొక్కలు పెరిగి పెద్దవి అవుతున్నాయి. ప్రధాన వంతెనపై ఇంత సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. – పొన్నూరు

కళాశాలల్లో సంక్రాంతి సందడి

ప్రత్తిపాడు: ఇంజినీరింగ్ కళాశాలల్లో సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. మండల పరిధిలోని తుమ్మలపాలెం మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగి మంటలు వెలిగించి, రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం సంక్రాంతి పొంగళ్లు పెట్టి సంప్రదాయాలను చాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.గోపికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాధిపతి జి.రాజీకుమార్, సెక్రటరీ ఎంబీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కిట్స్ అక్షర్‌లో..

ప్రత్తిపాడు మండలం యనమదల కిట్స్ అక్షర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్‌లు హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పల్లెవాతావరణాన్ని సృష్టిస్తూ వేడుకలను నిర్వహించారు. రచ్చబండ, ఉయ్యాలలు, భోగిమంటలు, రంగవల్లులు, హరిదాసులతో సంక్రాంతి శోభ కనువిందుచేసింది.

విజ్ఞాన్‌లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

చేబ్రోలు: సంక్రాంతి విశిష్టతను తెలిపే రంగురంగుల రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కోలాటాలతో తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రైతుల పండుగని తెలిపారు. మన పండుగల్లోని విశిష్టతను, శాస్త్రీయతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు.



మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో రంగవల్లులను తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు

సంక్రాంతి సంబరాలలో భాగంగా విద్యార్థులు గోమాతను పూజించి, పొంగళ్లు పొంగించారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. రంగురంగుల ముగ్గులు వేశారు. భోగి మంటలు వేశారు. సంక్రాంతి పాటలు పాడారు. సంక్రాంతి విశిష్టతను తెలిపేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమ నృత్యాలు ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువులు ఏర్పాటుచేశారు. హరిదాసు సంకీర్తనలు వినిపించాడు. పిండి వంటలు వండారు. డోలు, సన్నాయిలతో వినోద బృందం కనువిందు చేసింది. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వైస్ చాన్స్‌లర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్‌లో సంక్రాంతి సంబరాలు..

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగువారి సంప్రదాయ పండుగని తెలిపారు. అధ్యాపకుడు డాక్టర్ పీవీ నరసింహారావు మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ రోజుల విశిష్టతను తెలిపారు.



విద్యార్థులతో కలిసి గోలీలాట ఆడుతున్న కిట్స్ అక్షర్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



సంప్రదాయ దుస్తులలో విద్యార్థినులు



చిన్నారులకు పోస్తున్న భోగిపళ్లు



చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌లో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య

భక్తిశ్రద్ధలతో కూడారై పూజలు

పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెం శ్రీ రామ మందిరంలో ధనుర్మాసం పురస్కరించుకుని కూడారై వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్త బియ్యంతో పాయసం తయారు చేసి 108 గిన్నెలలో పోసి గోదాదేవి అమ్మవారికి సమర్పించారు.

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. కూడారై సందర్భంగా స్వామివారికి 108 కుండలతో పాయసం ప్రసాద తయారీ, నివేదన వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెదకాకాని: సంక్రాంతి పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని పెదకాకాని సీఐ నారాయణస్వామి శనివారం హెచ్చరించారు. గతంలో కేసులు ఉన్న వారిపైనా, కోడిపందేలు నిర్వహించే వారిపైనా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా యువత కోడి పందేలు, జూదాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిర్మానుష ప్రదేశాలలో నిషేధిత ఆటలు నిర్వహించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.

కోడిపందేలు నిషేధం

చేబ్రోలు: సంక్రాంతి సందర్భంగా చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో కోడి, ఎద్దుల పందేలు, బెట్టింగ్స్, జూదం వంటి మొదలగు చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనవద్దని చేబ్రోలు తహసీల్దారు కే శ్రీనివాసశర్మ, ఎస్ఐ డి.వెంకటకృష్ణ వేర్వేరు ప్రకటనల్లో శనివారం తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి జంతు సంబంధమైన వాటిని ఇబ్బందులు కలగ జేయకూడదని తెలిపారు. మన ఆనందం కోసం వాటిని ఇబ్బంది పెట్టకూడదన్నారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై 1974 యానిమల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు ద్వారా నిఘా ఉంచి కోడిపందేలు, జూద శిబిరాల్లో పాల్గొంటే వీడియోల ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వీధిలో మురుగుతో అవస్థలు



వీధిలో నిలిచిన మురుగు

పొన్నూరు: నిడుబ్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం భవనం ఎదురు వీధిలో నెలలుగా మురుగు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పన్నులు సకాలంలో చెల్లిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని చెబుతున్నారు. ఈ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వడ్డే ఓబన్న చిరస్మరణీయుడు

నెహ్రూనగర్: స్వాతంత్య్ర పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం వెలకట్టలేనిదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన స్వాతంత్య్ర పోరాటంలో సైన్యాధ్యక్షుడిగా ఓబన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో నల్లమల అడవుల్లో జరిగిన కుంపినీ వ్యతిరేక పోరాటంలో సైన్యాధ్యక్షుడిగా ముందుండి సైన్యాన్ని నడిపిన ఓబన్న పోరాట చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

ఐదో రోజుకు చేరిన న్యాయవాదుల నిరాహార దీక్ష



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

పొన్నూరు: పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పట్టణ పోలీసులు పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఐదో రోజుకు చేరింది. శనివారం న్యాయవాదులు విప్పర్ల సదానందరావు, వలపర్ల రాంబాబు దీక్ష నిర్వహించారు. న్యాయవాది జీఎస్ రాయల్ మాట్లాడుతూ రక్షణ కల్పించాల్సిన పోలీసుల నుంచి న్యాయవాదులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. అకారణంగా ప్రకాశరావుపై జరిగిన దాడిని ఖండించారు. వెంటనే ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లి విజయ్‌కుమార్, దేవరపల్లి సునీల్, కోటేశ్వరరావు, తలారి ఆంద్రూస్, పి. వెంకటప్పయ్య, కె.హేమంత్, సిహెచ్.వెంకటప్పయ్య పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు ప్రారంభం

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామాల ప్రజల ఇలవేల్పు దేవత శ్రీ ఘంటాలమ్మ శ్రీపట్టలమ్మతల్లి గుడి సంక్రాంతి సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి ఇంజిరెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలను పురస్కరించుకుని జూనియర్ స్థాయి షటిల్ పోటీలను ప్రారంభించినట్లు చెప్పారు. 12వ తేదీ ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9490642637, 9848454568, 7386242526 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సేఫ్ కేర్ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు

గుంటూరు రూరల్: గోరంట్ల ప్రభుత్వ ఛాతి సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి సేఫ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో చిన్నారులతో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగిమంటలతో, రంగవల్లులతో గొబ్బెమ్మలు, మామిడి తోరణాలు పూలమాలతో సంక్రాంతి పండుగ శోభ సతరించుకుంది. సేఫ్ కేర్ సెంటర్ లైబ్రరీని జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరస్వామి, చిన్నారులను భోగిపళ్లతో పెద్దలందరూ ఆశీస్సులు అందించారు. తెలుగు సంప్రదాయ వంటలతో, భోగికి గుర్తుగా పులగము, సంక్రాంతి గుర్తుగా పొంగలి, కనుము గుర్తుగా చికెన్, సంక్రాంతి పిండి వంటలుగా బూరెలు, గారెలు, ఆహారం పంపిణీ చేశారు. ప్రతి నెల రెండో శనివారం పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం భాగముగా యాపిల్ పళ్ళు, కమలాలు అరటిపళ్ళు, పప్పు ఉండలు ప్యాకెట్లు, రాగి పిండి బెల్లం కిట్లతో పాటు, బియ్యం దుప్పట్లు, టవల్స్, టిఫిన్ బాక్సులు, కిరాణా సరుకులు చిన్నారులు అందరికీ అందించారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్ పాల్, సభ్యులు, మానవతా సేవా సంస్థ ప్రెసిడెంట్ రమేష్, సభ్యులు, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వెన్నెల, డాక్టర్ సరిత, కౌన్సిలర్ కోటిరత్నం సౌజన్య భాగ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ ఆనంద్, స్టాఫ్ నర్స్ లోకేశ్వరి, డేటా మేనేజర్ జ్యోతి, ఫార్మసిస్ట్ జ్యోతి పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులను భోగి పండ్లతో ఆశీర్వదిస్తున్న దృశ్యం

అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే చర్యలు

ప్రత్తిపాడు: అధిక ధరలకు సినిమా టికెట్లను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.కరుణ కుమార్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మారుతి థియేటర్‌లో ఆదివారం విడుదల కానున్న సినిమాకు సంబంధించి టికెట్లను అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ శనివారం తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. థియేటర్ యాజమాన్యంతో మాట్లాడారు. నిబంధనలకు లోబడే టికెట్లు విక్రయించాలన్నారు. ప్రజలపై సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. గతంలోనూ ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని, మరోసారి ఇలా సమస్యలు రాకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా థియేటర్‌లో ప్రేక్షకులకు అన్ని వసతులు సమకూర్చాలని, పారిశుద్ధ్యం, శానిటేషన్ వంటి కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. టికెట్ ధరల రేట్లను కౌంటర్ వద్ద ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు.



ప్రత్తిపాడు థియేటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కరుణకుమార్

మినీ గోకులం షెడ్లు ప్రారంభం

చేబ్రోలు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేబ్రోలు మండలంలోని వేజండ్ల, సుద్దపల్లి, శేకూరు గ్రామాలలో శనివారం పాడి రైతులకు నూతన మినీ గోకులం షెడ్ల (పశువుల షెడ్డు)ను శనివారం ప్రారంభించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొత్తం 28 మంది లబ్ధిదారులకు మినీ గోకులం షెడ్డులను మంజూరు చేశారు. వేజండ్లలోని గవిని రవీంద్ర, గైరుబోయిన బసవయ్య, సుద్దపల్లి గ్రామంలో కంకణాల నాంచారయ్య, శేకూరు గ్రామంలో బొల్లావుల వెంకటేశ్వర్లుకు చెందిన పశువుల షెడ్డు యొక్క పూర్తి యూనిట్ విలువ రూ.2.30 లక్షలు దీనిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.03 లక్షలు కాగా మిగిలిన 10 శాతం లబ్ధిదారుని, వేజ్ వాటాతో షెడ్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. పశుపోషకులను ప్రోత్సహించటం కోసం ప్రభుత్వం మినీ గోకులం షెడ్ల నిర్మాణం చేసినట్లు ఎంపీడీఓ కె.లలిత తెలిపారు. గోకులం షెడ్లను ఉపయోగించికొని ఆర్థికాభివృద్ధి సాధించాలని అధికారులు, నాయకులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైలా వెంకటరామరాజు, చందు శ్రీరాములు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వీరంకి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వంగిపురంలో గోకులాలు ప్రారంభం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని వంగిపురంలో నూతనంగా గోకులం షెడ్లను శనివారం ప్రారంభించారు. ప్రత్తిపాడు పశుసంవర్ధకశాఖ ఏడీ కె. శ్రీనివాసరెడ్డి, స్థానిక అధికారులు, కూటమి నాయకులతో కలిసి షెడ్లును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై పశువుల షెడ్లను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. షెడ్లు పాడిరైతులకు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ నందకిషోర్ పాల్గొన్నారు.



వేజండ్లలో మినీ గోకులం షెడ్డు ప్రారంభానికి హాజరైన ప్రజాప్రతినిధులు



వంగిపురంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న వెటర్నరీ ఏడీ శ్రీనివాసరెడ్డి

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై అధికారులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 4 రోజులపాటు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంబరాల్లో భాగంగా ఆదివారం 9 గంటల నుంచి 11 గంటల వరకు ముగ్గుల పోటీలు (రంగోలి), మెహంది (మహిళలు, పిల్లలకు) జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే సంబరాల్లో నిర్వహించే వివిధ పోటీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తమ పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. సంబరాలు జరిగే స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు అధికారులు, నిర్వహణ కమిటీ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

ఐలాండ్స్ సుందరీకరణపై దృష్టి సారించాలి

గుంటూరు నగరంలోని ఐలాండ్స్, డివైడర్ల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ గాంధీ పార్క్ ఎదుట ఐలాండ్, డివైడర్లు, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఎదుట పింక్ టాయ్ లెట్స్, పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యాన్ని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఐలాండ్స్‌లో పచ్చదనం పెంపు, నీటి స్ప్రింక్లర్ల మరమ్మతులుంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డివైడర్లపై పచ్చదనం కోసం నాటిన మొక్కలు కొన్ని ప్రాంతాల్లో లేవని, ఆయా ప్రాంతాల్లో నూతన మొక్కలు నాటాలని, ఉన్న మొక్కలను ఎప్పటికప్పుడు ట్రిమ్మింగ్ చేయాలని పార్క్ విభాగ ఏడీహెచ్‌ని ఆదేశించారు. విజ్ఞాన మందిరం ఎదుట పింక్ టాయ్ లెట్స్‌ని పరిశీలించి, వాటి నిర్వహణ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఓల్డ్ క్లబ్ రోడ్, కుగ్లర్ హాస్పిటల్ రోడ్‌లో పర్యటించి పారిశుద్ధ పనులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు.



సంక్రాంతి సంబరాలపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు